స్వచ్ఛందంగా బంద్


జిల్లాకేంద్రం తెలంగాణ చౌరస్తాలో బైఠాయించిన హిందూ ఐక్యవేదిక నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పాలమూరు పట్టణంలో బంద్ చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి కూరగాయల మార్కెట్‌తోపాటు వివిధ దుకాణాల వారు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వస్త్ర దుకాణాలు, హోటళ్లు, కిరాణాషాపులను కూడా బంద్ చేశారు. చిన్నపాటి గల్లీల్లో ఉండే దుకాణాలు సైతం మూసివేశారు. టీటీడీ కల్యాణ మండపం నుంచి హిందూ వేదిక ఆధ్వర్యంలో వేలాదిగా హిందువులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ న్యూటౌన్, ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, టూటౌన్ పోలీస్ స్టేషన్ చౌరస్తా మీదుగా రాంమందిర్ చౌరస్తా, పాన్‌చౌరస్తా, క్లాక్‌టవర్, పాతబస్టాండ్ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు సాగింది. కాషాయ జెండాలతో ప్లకార్డులతో యువత ర్యాలీలో పాల్గొన్నారు. జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై నినాదాలు హోరెత్తాయి. అనంతరం తెలంగాణ చౌరస్తాలో బైఠాయించి కొద్దిసేపు నిరసన తెలిపారు. జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు గొండ్యాల రాఘవేంద్రశర్మ మాట్లాడారు. బంగ్లాదేశ్ హిందూవులపై, దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి భారత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్క హిందూ ధార్మిక సంఘానికి, వ్యాపారసంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, విశ్వహిందూ పరిషత్ నేతలు మద్ది యాదిరెడ్డి, లక్ష్మీనారాయణ, హన్మంతు, నరేంద్ర, రాష్ట్ర దుర్గవాహిని సహ ప్రముఖ్ సింధూజ, సులోచన, అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, చెన్న వీరయ్య తదితరులు పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూవులు, దేవాలయాలకు రక్షణ కల్పించేలా భారత ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.


నిర్మానుష్యంగా పాలమూరు రైతుబజార్

భూత్పూర్: మండలకేంద్రంలో చేపట్టిన పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే దుకాణాలు, విద్యాసంస్థలను మూసి ఉంచారు.

హన్వాడ/మహమ్మదాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హింసలపై హన్వాడ, మహమ్మదాబాద్ మండలాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


హన్వాడలో..


భూత్పూర్ చౌరస్తాలో నిరసన


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైద్యులు


జడ్చర్లలో నిరసన తెలుపుతున్న వైద్యులు

రోడ్డెక్కిన పాలమూరు వైద్యులు

- కోల్‌కతా ఘటనపై నిరసనలు

పాలమూరు: కోల్‌కతాలోని మెడికల్ కళాశాల వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య ఘటనలపై శనివారం పాలమూరు జిల్లా వ్యాప్తంగా వైద్యులు రోడ్డెక్కారు. ఘటనపై తీవ్రంగా స్పందించారు. రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలిపారు. ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులను పూర్తిగా మూసి ఉంచారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో క్యాజువాలిటీలో అత్యవసరంగా వచ్చిన రోగులకు మాత్రం పలు రకాల వైద్య సేవలు అందించారు. ఇక మిగిలిన ఆస్పత్రుల్లో ఎలాంటి వైద్య సేవలు అందలేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే అన్ని రకాల వైద్యులు బంద్‌కు పూర్తిగా మద్దతు ఇచ్చారు. ఐఎంఏ, ప్రభుత్వ జూనియర్ వైద్యుల ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో జూనియర్ డాక్టర్లు వైద్య విద్యార్థినిపై జరిగిన దాడితో పాటు సమాజంలో అమ్మాయిలు, మహిళలపై జరుగుతున్న దాడులపై నాటిక రూపంలో ప్రదర్శించారు. అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ విజయేందిర, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్‌కు వినతి పత్రాలు అందించారు.

వైద్యురాలిపై దాడి చాలా బాధకరమని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ అన్నారు. బాధ్యుడికి శిక్ష పడేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. దాడులు పెరుగుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. వైద్యులకు ఒక రక్షణ లేకుండా పోతోందని వాపోయారు. సీనియర్ వైద్యులు డాక్టర్ శ్యామూల్, విజయ్‌కాంత్, రాఘవేంద్రకుమార్, వినోద్‌కుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, స్వప్న అర్చన తదితరులు పాల్గొన్నారు. కాగా ఘటనకు నిరసనగా పట్టణంలో ఉన్న అన్ని రకాల మెడికల్ దుకాణాలు సాయంత్రం వరకు బంద్ చేశారు.


జిల్లాకేంద్రంలోని తెలంగాణా చౌరస్తాలో డాక్టర్ల మానవహారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహిళలకు సమాజంలో స్వేచ్ఛ లేకుండా పోయిందని ఏబీవీపీ నాయకుడు శివ పేర్కొన్నారు. పీయూలో నిరసన చేపట్టారు. నగేష్, ఓం ప్రకాష్, శివప్రసాద్, శశి, కిరణ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి ప్రశాంత్, తదితరులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. వైద్యాధికారి శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో నిర్వహించిన నిరసన, బంద్ కార్యక్రమాల్లో ఐఎంఏ అధ్యక్షుడు సుజిత్‌కుమార్, సీనియర్ వైద్యులు డా. రాంరెడ్డి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: డాక్టర్‌పై అత్యాచారం హేయమైన చర్య అని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు


భూత్పూర్‌లో ర్యాలీ..

నవాబుపేట: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నరేష్‌చంద్ర, డాక్టర్ శ్రీజా, శ్రీనివాస్, శరభలింగం తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మండలంలో కార్యక్రమంలో వైద్యాధికారి అబ్దుల్ రబ్, డాక్టర్లు యమున, రమణి, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నవాబుపేటలో..


గండేడ్‌లో..

క్లుప్తంగా

వ్యవసాయాధికారిగా శివకుమార్

అడ్డాకుల: మూసాపేట మండల వ్యవసాయధికారిగా శివకుమార్‌ను కేటాయించారు. వనపర్తి జిల్లా రేవల్లిలో పని చేస్తున్న ఆయనను ఇక్కడికి కేటాయించడంతో శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన రాజేందర్‌రెడ్డిని షాద్‌నగర్ సమీపంలోని చౌదర్‌గూడకు బదిలీ చేశారు. అదేవిధంగా అడ్డాకుల మండలంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు మహబూబ్‌నగర్ అర్బన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి భ్యూలాను కేటాయించగా శనివారం బాధ్యతలు చేపట్టారు.

హామీని విస్మరించొద్దు

చిన్నచింతకుంట: తిరుమలాపురం గ్రామాన్ని చిన్నచింతకుంట మండలంలోనే కొనసాగించాలని బీజేపీ నాయకుడు పుట్ట అంజయ్య, తదితరులు కోరారు. శనివారం విషయంపై మాట్లాడారు. కొకుంట్లలో కలిపి తీవ్ర ఇబ్బందులు కల్గించారన్నారని వాపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే హామీని విస్మరించొద్దని కోరారు.

ధార్మిక సభకు ఏర్పాట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని జామీయ మసీద్‌లో ఈనెల 19న జొహర్ నమాజ్ అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు జల్సాయే రహెమతులిల్ ఆలేమీన్ ధార్మిక సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలిండియా సున్నీ ఉల్మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ, మజీద్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ జకీ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. సభలో మాలేగావ్‌కు చెందిన అంతర్జాతీయ ప్రసంగీకులు సయ్యద్‌షా అమీనుల్ ఖాద్రీ సందేశం ఇస్తారని వివరించారు. ప్రముఖ ధార్మికవేత్త సయ్యద్‌షా కలీముల్లా హుస్సేని పాల్గొంటారని తెలిపారు. అనంతరం సభ ఏర్పాట్లను పరిశీలించారు. మతపెద్దలు సయ్యద్ అమీనుద్దీన్ ఖాద్రీ, గౌస్ మొహియొద్దీన్, అహ్మద్ సనా, మహ్మద్ కలీమోద్దీన్, తఖీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

జడ్చర్ల టౌన్: కార్మికుల సమస్యలను తప్పుదోవ పట్టించి మోసం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజయ్యను సస్పెండ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దశలవారి ఆందోళనలు చేస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కరించకుండా.. మాట్లాడేందుకు ఆసక్తి చూపకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు మహేష, కార్యదర్శి కృష్ణ, కార్మికులు సాగర్, కేశవులు, నర్సింహ్మ, యాదమ్మ, భారతి, దేవమ్మ, అంజమ్మ, శ్యామల, అరుణ, అనూష పాల్గొన్నారు.



రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 22,37,848 మంది రైతుల ఖాతాల్లో రూ.17,934 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. సాంకేతిక కారణాలతో కొంతమందికి రుణమాఫీ కాలేదని, ఈ సమస్యలను పరిష్కరించి మిగిలిన వారందరికీ రుణమాఫీ అవుతుందన్నారు. రుణమాఫీ రాని రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వర్తిస్తుందన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రుణమాఫీపై కేటీఆర్, హరీశ్‌రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. హరీష్‌రావుకు సిగ్గు ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేస్తే సిద్దిపేటలో మళ్లీ ఎమ్మెల్యేగా గెలవరనే భయంతోనే పిల్లిమొగ్గలు వేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై నోటికొచ్చినట్లు మాట్లాడితే కేటీఆర్, హరీశ్‌రావులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సిరాజ్‌ఖద్రీ, లక్ష్మణ్‌యాదవ్, నాగిరెడ్డి, ఫయాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో కూడలి అభివృద్ధి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు రూ.25 లక్షలతో కూడలి అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా అక్కడ గాంధీజీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే వీటిని ప్రజాప్రతినిధులు ఆవిష్కరించనున్నారు. కాగా, శనివారం డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే ఎం.మధుసూదన్‌రెడ్డి, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ తదితరులు పరిశీలించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

లక్ష అడుగుల లక్ష్యం చేరుకుందాం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపైకి శ్రావణమాసంలో లక్ష అడుగుల లక్ష్యం చేరుకుందామని, అందుకు పట్టణవాసులతోపాటు గ్రామాల ప్రజలు సహకరించాలని.. రంగనాథ ఆలయ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం గుట్టపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లక్ష్మీసమేత రంగనాథ స్వామి ఆలయం అభివృద్ధి.. బాదేపల్లి పట్టణం అభివృద్ధికి దోహదపడుతుందని తమ పెద్దలు చెప్పేవారన్నారు. అందుకే ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చామని పేర్కొన్నారు. శ్రావణ మాసం ఆరంభం నుంచి ఇప్పటి వరకు 30 వేల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించారని.. మరో 70వేల మంది రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వామిని 11 పర్యాయాలు దర్శించుకుంటే కోరిన కోరిక నెరవేరుతుందని, సంతానం, ఆరోగ్యం, ఉద్యోగం వంటివి ఇప్పటికే ఎంతోమంది భక్తులు పొందారన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. శ్రీనివాసులుగౌడ్, విక్కి పాల్గొన్నారు.

జంతు జనన నియంత్రణ కేంద్రం విస్తరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఒకటో వార్డు పరిధిలోని మౌలాలీగుట్ట వద్ద ఉన్న జంతు జనన నియంత్రణ (ఏనిమల్ బర్త్ సెంటర్ - ఏబీసీ) కేంద్రాన్ని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఎక్కడబడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలను ప్రత్యేక బృందం పట్టుకుని ఇక్కడికి తరలిస్తున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి, కొన్ని రోజుల పాటు అందులో ఉంచి తిరిగి ఆయా వీధులలో వదులుతున్నారు. అయితే స్థలం సరిపోక పోవడంతో ఈ కేంద్రాన్ని సుమారు రూ.20 లక్షలతో విస్తరిస్తున్నారు. ఈ పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ హరికృష్ణ తదితరులు పరిశీలించారు.


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

పాఠశాలల్లో సామూహికంగా రక్షాబంధన్


జడ్చర్ల సరస్వతి శిశుమందిరంలో రక్షాబంధన్


రాజాపూర్ ఉన్నతపాఠశాలలో..

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో శనివారం సామూహికంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. జడ్చర్ల పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో కార్యక్రమంలో విద్యార్థులచే రాఖీ కట్టించారు. రామస్వామి గుట్ట తండా ప్రాథమిక పాఠశాలలోనూ కార్యక్రమం చేపట్టారు. కోయిల్‌కొండలో శ్వేతా విద్యామందిర్‌లో విద్యార్థులు 'రాఖీ' అక్షరాల ఆకృతిలో విద్యార్థులు నిలుచుని ఆకట్టుకున్నారు. రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కేజీబీవీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. నవాబుపేటలో విద్యార్థులు ప్రభుత్వ కార్యాయాలల్లో సిబ్బందికి రాఖీలు కట్టారు. దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీవాణి శిశుమందిర్, డోకూర్ సమీపంలోని తపోవన్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు శనివారం ఘనంగా రక్షాబంధన్ నిర్వహించారు.


నవాబుపేట ఎంపీడీఓ కార్యాలయంలో..


దేవరకద్రలో..


కోయిల్‌కొండలో..

మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మహబూబ్‌నగర్ రూరల్: మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 160 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్

భూత్పూర్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీలో కళాజాతా నిర్వహించారు. సెల్‌ఫోన్లను అతిగా వాడరాదని సూచించారు. సైబర్ నేరగాళ్లకు చిక్కొద్దని వివరించారు.

నీటిని నిల్వ ఉంచరాదు

దేవరకద్ర: మండల కేంద్రంలో శనివారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఇళ్లలో నీటిని నిల్వ చేయరాదని దీనివల్ల దోమలు పెరుగుతాయని తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు.

పనులు ప్రారంభం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రహరీ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాల ఏళ్ల నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని ప్రస్తుతం సమస్య తీరనుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, బాలయ్య, రాజేశ్వర్, ఆదాం, సంపత్, ఉస్మాన్, పర్వతాలు, రాంగౌడ్, శంకర్, జహంగీర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రాజాపూర్: తండాల్లో నివసించే గిరిజనులు తమ హక్కులు, చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జడ్చర్ల అదనపుకోర్టు న్యాయమూర్తి మహమ్మద్ ముద్దసీర్ పేర్కొన్నారు. శనివారం సింగమ్మగూడ తండాలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల హక్కులు, చట్టాలపై గ్రామస్తులకు వివరించారు. న్యాయవాదులు పురుషోత్తం, జంగయ్య, షాకీర్‌మాలిక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసీర్

'మాట నిలబెట్టుకునే ప్రభుత్వం మాది'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: మాట నిలబెట్టుకునే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నంచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి మండల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేసిందని విమర్శించారు. వారి హయాంలో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ పేదలకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్లు తిరుపతయ్య, నాగలక్ష్మి, ఎంపీడీఓ దేవన్న, మండలాల అధ్యక్షులు కేఎం నారాయణ, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కోయిల్‌కొండ: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం.. నాణ్యతతో భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ కాశప్ప సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. భోజన సరుకులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైనవి మాత్రమే వంటల్లో వాడాలని సూచించారు. గదులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చొరవ తీసుకోవాలని వార్డెన్ రాధకృష్ణకు సూచించారు.

పెరుమాళ్ల అంజన్న ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని కూచూర్‌లో పెరుమాళ్ల ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు పెరుమాళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. అనంతరం శకటోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సంజీవరెడ్డి, భోజయ్య, రవి, యాదిలాల్, నర్సింహ, యాదయ్య తదితరులు ఉన్నారు.